క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నల్లగొండ: పట్టణంలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏడీఈ వేణు గోపాలచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీలైన్ షిఫ్టు, రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న ప్రాంతాలైన మిర్యాలగూడ రోడ్, బీటీఎస్, దుర్గాకాలని, కలెక్టరేట్, ఫారెస్టు ఆఫీస్ రోడ్డు, శివాలయం ఏరియా, డైట్ సమీప ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

నల్లగొండ టౌన్: ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని నల్లగొండలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం మాజీ జిల్లా కార్యదర్శి జిల్లా యాదయ్య ఏఐఎస్ఎఫ్ జెండాను ఆవిష్కరించారు. గుర్రం వెంకట్‌రెడ్డి, ముదిగొండ మురళీకృష్ణ, వలమల్ల ఆంజనేయులు, పోలేని సందీప్, నరేష్, విప్లవ్, చరణ్, అనిల్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత


నివాళులర్పిస్తున్న కంచర్ల భూపాల్‌రెడ్డి

కనగల్: మండల పరిధిలోని లింగాలగూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు మర్రి నరసింహ (45) అనారోగ్యంతో మృతి చెందాడు. మంగళవారం ఆయన మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.30 వేలు అందజేశారు. అదేవిధంగా నరసింహ కుటుంబానికి మంత్రి కోమటిరెడ్డి పంపిన రూ.10వేల నగదును కాంగ్రెస్ నాయకులు అందజేశారు. కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గోలి జగాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గోలి నర్సిరెడ్డి, లింగాలగూడెం పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం..


పెచ్చులూడిపోయిన పైకప్పు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ జిల్లా కోర్టు భవనం మొదటి అంతస్తు సబ్ కోర్టు ఆవరణ కారిడార్‌లో మంగళవారం స్లాబ్ పెచ్చులు ఊడిపడ్డాయి. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

మట్టిలో దిగబడిన బస్సు


గట్టుప్పల్‌లో రోడ్డు వెంట దిగబడిన బస్సు

గట్టుప్పల్ : ఎదురుగా వస్తున్న బస్సుకు సైడ్ ఇచ్చే క్రమంలో నల్లగొండకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ప్రమాదవశాత్తు గట్టుప్పల్ తహసీల్దారు కార్యాలయం సమీపంలో దిగబడింది. వివరాలు.. నల్లగొండ నుంచి చండూరు మీదుగా హైదరాబాద్‌కు వెళ్తున్న ఆర్టీసీ బస్సు.. హైదరాబాద్ నుంచి చౌటుప్పల్ మీదుగా వస్తున్న బస్సు గట్టుప్పల్ తహసీల్దారు కార్యాలయం వద్ద ఎదురుపడ్డాయి. హైదరాబాద్ నుంచి వస్తున్న బస్సు సైడ్ తీసుకోవడంతో రోడ్డు పక్కన దిగబడింది. సమాచారం తెలుసుకున్న కానిస్టేబుల్ ఆఫ్రీనా.. జేసీబీ సహాయంతో బస్సును బయటకు తీయించి పంపించారు.

ఇళ్ల స్థలాలు, ఇళ్లు ఇవ్వాలి

నకిరేకల్ : పేదలందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలను ప్రభుత్వమే ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బొజ్జ చినవెంకులు, మహిళా కూలీల సంఘం జిల్లా కన్వీనర్ దండెంపల్లి సరోజ కోరారు. నకిరేకల్ పట్టణంలోని భవన నిర్మాణ కార్మికుల అడ్డాలో మహిళా కూలీల సమస్యలపై మంగళవారం సర్వే నిర్వహించి మాట్లాడారు. మండల కార్యదర్శి సాకుంట్ల నర్సింహ, కొడదల లక్ష్మమ్మ, గుండె దుర్గమ్మ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ త్రోబాల్ సెలక్షన్స్‌కు 'ఎన్జీ' విద్యార్థి

రామగిరి(నల్లగొండ): తెలంగాణ త్రోబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర త్రోబాల్ సెలెక్షన్స్‌లో నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కళాశాలకు చెందిన బీఏ మొదటి సంవత్సరం విద్యార్థి జి. ప్రవీణ్ కుమార్ పాల్గొని నేషనల్ సెలక్షన్స్‌కు ఎంపికయ్యారు. త్వరలో జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీ పట్టణంలో జరిగే జాతీయ త్రోబాల్ సెలక్షన్స్‌లో ప్రవీణ్‌కుమార్ పాల్గొననున్నారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్‌ను కళాశాల ప్రిన్సిపాల్ సముద్రాల ఉపేందర్, కళాశాల ఇన్‌చార్జి ఫిజికల్ డైరెక్టర్ ఆదె మల్లేశం, వైస్ ప్రిన్సిపాల్ పరంగి రవికుమార్, అకాడమిక్ కోఆర్డినేటర్లు మునిస్వామి, అంతటి శ్రీనివాస్, అధ్యాపకులు అభినందించారు.

నిర్మాణ లోపం.. ప్రజలకు శాపం !

- ఇనుపాముల అండర్ పాస్ బ్రిడ్జిలో నిలుస్తున్న నీరు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- వర్షపు నీరు నిలిచి వంతెన ఎదుట ఏర్పడిన గుంతలు


ఇనుపాములలోని అండర్‌పాస్ వంతెన వద్ద నిలిచిన వర్షపు నీరు


అండర్ పాస్ బ్రిడ్జిలో నీరు నిలవడంతో డివైడర్ పైనుంచి హైవే దాటుతున్న వాహనదారులు

కేతేపల్లి: అండర్‌పాస్ వంతెన నిర్మాణం పూర్తయితే తమ గ్రామాలకు వెళ్లేందుకు ఇబ్బందులు తీరుతాయనుకున్న వాహనదారులకు కొత్త సమస్య ఏర్పడింది. 65 నంబరు జాతీయ రహదారిపై కేతేపల్లి మండలం ఇనుపాముల గ్రామం వద్ద ఏర్పాటు చేసిన వంతెన (క్యాటిల్ అండర్‌పాస్) కింద వర్షపు నీరు చేరుతోంది. చిన్నపాటి వర్షం కురిసినా అండర్‌పాస్‌లో మోకాలు లోతు నీరు నిలిచి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నకిరేకల్ పట్టణం నుంచి ఇనుపాముల గ్రామం మీదుగా కేతేపల్లి మండలంలోని బండపాలెం, కొండకిందిగూడెం, చెర్కుపల్లి, తుంగతుర్తి గ్రామాలతో పాటు మాడ్గులపల్లి, తిప్పర్తి మండలాల్లోని దాదాపు మరో పది గ్రామాలకు చెందిన వారు రాకపోకలు సాగిస్తున్నారు. అదేవిధంగా సూర్యాపేట జిల్లా కేంద్రం నుంచి నకిరేకల్ పట్టణంలోకి వచ్చే వాహనదారులు సైతం ఈ అండర్ పాస్ వంతెన గుండా రోడ్డు దాటాల్సి ఉంది. 2010 సంవత్సరంలో 65 నంబరు జాతీయ రహదారిని నాలుగు లేన్లుగా విస్తరించిన సమయంలో జీఎమ్మార్ కాంట్రాక్టు సంస్థ ఇనుపాముల వద్ద అండర్‌పాస్ వంతెన నిర్మించ లేదు. దీంతో ఆయా గ్రామాలకు వెళ్లే వాహనదారులు ఇనుపాముల వద్ద రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాల బారిన పడేవారు. రోడ్డును విస్తరించిన నాటి నుంచి ఇక్కడ జరిగిన ప్రమాదాల్లో 20 మంది మృత్యువాత పడగా మరో వందమంది వరకు గాయాలపాలయ్యారు. దీంతో గ్రామస్తులు ఇనుపాముల బస్‌స్టేజీ వద్ద అండర్‌పాస్ వంతెన నిర్మించాలని ఏళ్లపాటు ఆందోళనలు చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులకు, జీఎమ్మార్, ఎన్‌హెచ్ఏఐ కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేశారు.

క్యాటిల్ అండర్‌పాస్ నిర్మాణం

గ్రామస్తుల ఆందోళనతో దిగి వచ్చిన సంబంధిత కాంట్రాక్టర్, అధికార యంత్రాంగం ఇనుపాముల వద్ద పశువులు, ఎడ్లబండ్లు, ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు, ఖాళీ ట్రాక్టర్లు మాత్రమే వెళ్లేందుకు వీలుగా మూడేళ్ల కిత్రం క్యాటిల్ అండర్‌పాస్ వంతెన నిర్మించారు. అండర్‌పాస్ వంతెన నిర్మించాలంటే వంతెన నిర్మించే ప్రాంతానికి రెండు వైపులా ముందుగా మట్టితో ఎత్తుగా కట్టపోసి నిర్మాణం చేపట్టాలి. కానీ ఇక్కడ మాత్రం వంతెన నిర్మాణం చేపట్టే ప్రాంతంలో హైవేకు అడ్డంగా దాదాపు 15 అడుగుల లోతు వరకు తవ్వారు. అనంతరం తవ్విన చోట స్లాబ్ వేసి వంతెన ఏర్పాటు చేశారు. హైవేకు సమాంతరంగా ఇరువైపులా పది అడుగుల వరకు మట్టిని తొలగించి అండర్‌పాస్ వంతెన వరకు సర్వీసు రోడ్లు నిర్మించారు.

గుంతలు ఎక్కడ ఉన్నాయో తెలియక..

సర్వీసు రోడ్ల కంటే వంతెన దిగువకు ఉండడంతో వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు వంతెన కింద వరద నీరు చేరింది. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మోకాలి లోతు నీరు నిలిచి ఉండడంతో ద్విచక్ర వాహనదారులు, నకిరేకల్ పట్టణంలోని పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు ఈ వంతెన కింద నుంచి ప్రయాణించలేని పరిస్థితి నెలకొంది. నిత్యం నీరు నిలిచి ఉండడంతో వంతెన ముందు గుంతలు ఏర్పడ్డాయి. నీరు నిలిచి ఉన్నప్పుడు గుంతలు ఎక్కడ ఉన్నాయో తెలియక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అండర్‌పాస్ వంతెన వద్ద వరదనీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

శాశ్వత పరిష్కారం చూపాలి



ప్రతి ఏటా వర్షాకాలంలో అండర్‌పాస్ వంతెనలో నీరు నిలిచి రోజుల తరబడి ఇబ్బందులు పడుతున్నాం. వంతెన కింద నుంచి రాకపోకలకు వీలు కాకపోవడంతో నడిచి వెళ్లేవారు, ద్విచక్ర వాహనదారులు డివైడర్ పైనుంచి హైవేను దాటుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.

–కానుగు యాదగిరి ఇనుపాముల

కలిసిమెలిసి ఉంటేనే గ్రామాల అభివృద్ధి

- ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి


ఎల్లలగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

మునుగోడు: పార్టీలకు అతీతంగా కలిసిమెలిసి ఉంటేనే గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతాయని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మునుగోడు మండలంలోని ఎల్లలగూడెం గ్రామంలో ఉపాధి హామీ నిధుల ద్వారా రూ.20 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో కలిసి ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ తాను నిజాయితీపరులకు మద్దతుగా ఉంటానని, పార్టీలో పనిచేసేవారైనా తప్పుచేస్తే సహించనన్నారు. గ్రామాల్లోని బెల్టు దుకాణాల కారణంగా తగువులు జరుగుతున్నాయని వాటిని పూర్తిగా మూసివేయించానని, దీంతో రాష్ట్రంలోనే మునుగోడు నియోజకవర్గంలో నేరాల సంఖ్య భారీగా తగ్గిందన్నారు. తాను పదవిలో ఉన్నా లేకపోయినా మునుగోడు ప్రజలకు సేవలు అందిస్తానన్నారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి పార్టీలకు అతీతంగా ఐక్యం కావాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో కొంతమందికి అన్యాయం జరుగుతోందని, కొందరు స్వార్థ రాజకీయ నాయకుల కారణంగా నిజమైన అర్హులకు లబ్ధి చేకూరడం లేదన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, చండూరు మార్కెట్ చైర్మన్ దోటి నారాయణ, పంచాయితీరాజ్ డీఈ నాగేశ్వరావు, ఏఈ సతీష్ రెడ్డి, ఎంపీడీఓ విజయభాస్కర్, మాజీ ప్రజాప్రతినిధులు సురిగి చలపతి, అనంత లింగస్వామి, బూడిద లింగయ్య యాదవ్, మిర్యాల వెంకన్న, జాల వెంకన్న, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మేకల ప్రమోద్‌రెడ్డి, తిరిపారి వెంకటేశ్వర్లు, ఈదులకంటి కైలాస్, తిరిపారి ఆంజనేయులు పాల్గొన్నారు.

సమాజ సేవకు ప్రతి నాయకుడు సిద్ధం కావాలి

నాయకులు, కార్యకర్తలు కేవలం రాజకీయాలు చేయడం కాకుండా సమాజ సేవలో భాగస్వాములు కావాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సూచించారు. మంగళవారం మునుగోడులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నాయకుడు మా గ్రామం, మా మండలం, మా నియోజకవర్గ అభివృద్ధి అనే లక్ష్యంతో ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న గురుకుల పాఠశాలలతోపాటు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి చందాలు ఇవ్వడమే కాకుండా ఎన్ఆర్ఐల నుంచి విరాళాలు సేకరించి పాఠశాలల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. ఈ సమావేశంలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీలు, ఎంపీపీలు, మున్సిపల్ చైర్మన్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి


తిప్పర్తి : కస్తూరిబా పాఠశాలలో వంటలను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి ఛాయాదేవి

తిప్పర్తి : ఆశ్రమ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని మండల ప్రత్యేక అధికారి ఛాయాదేవి అన్నారు. మంగళవారం తిప్పర్తి మండల కేంద్రంలోని కస్తూరిబా, ఆదర్శ పాఠశాలల వసతి గృహాలను ఆమె సందర్శించారు. పరిసరాలు, మరుగుదొడ్లు, వంటలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు అన్ని సదుపాయాలు కల్పించాలని, భోజనం విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేసేలా చూడాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఆమె వెంట ఎంపీడీఓ సుధాకర్, ఎంఈఓ నర్సింహ నాయక్, ఎంపీఓ జానయ్య తదితరులు ఉన్నారు.

పాఠశాలల పరిశీలన

చిట్యాల: మండల ప్రత్యేకాధికారి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పి.శ్రావణ్‌కుమార్ మంగళవారం చిట్యాల జెడ్పీహెచ్ఎస్, మండల పరిషత్ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, భవిత విద్యా వనరుల కేంద్రాలను పరిశీలించారు. జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన పలువురు విద్యార్థులు మధ్యాహ్న భోజనంలో కూర లేకుండా ఉండడాన్ని గమనించారు. హెచ్ఎం మాధవిని మధ్యాహ్న భోజనానికి ఎంత మంది విద్యార్థులకు అన్నం, కూర వండారని ప్రశ్నించగా.. హెచ్ఎం సరైన సమాధానం చెప్పలేదు. దీంతో డీఈఓకు తెలిపేందుకుగాను ఫోన్‌లో ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు. ఎంఈఓ సైదానాయక్‌కు ఈ విషయాన్ని తెలిపారు. సంబంధిత హెచ్ఎంపై తగిన చర్యలు తీసుకోవాలని తాను సూచించినట్లు డీఈఓకు తెలపాలన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

కేతేపల్లి: వైద్యాధికారులు, సిబ్బంది సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండి ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని మండల స్పెషల్ ఆఫీసర్ జె.హరీష్‌కుమార్ ఆదేశించారు. కేతేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఆస్పత్రి రికార్డులు, సిబ్బంది హాజరు పట్టిక, మందుల నిల్వల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు చేయటంతో పాటు సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం మూసీ ప్రాజెక్టు వద్ద గల బీసీ బాలుర గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న వసతులు, మధ్యాహ్న భోజన వంటలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, వంట చేసే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వంట ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట కేతేపల్లి ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు, ఎంపీఓ నాగలక్ష్మి, మండల వైద్యాధికారి అర్చన తదితరులు ఉన్నారు.

పాఠశాలల అభివృద్ధికి దాతలు సహకరించాలి

మునుగోడు: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు సహకారం అందించాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య అన్నారు. మంగళవారం మునుగోడు ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం పరిశీలించారు. పలువురు పూర్వ విద్యార్థుల ఆర్థిక సహాయంతో గోడలపై వేయిస్తున్న చిత్రాలను చూసి ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం మునుగోడు గ్రామ పంచాయతీ కార్యాలయం సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ విజయ భాస్కర్, మండల పంచాయతీ అధికారి పర్వేజ్, పాఠశాల హెచ్ఎం సుంకరి భిక్షంగౌడ్, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ మల్లేషం

చండూరు : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటూ ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని మున్సిపల్ కమిషనర్ మల్లేషం సూచించారు. చండూరు మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్యుడు రాజుతో కలిసి మున్సిపల్ సిబ్బంది, ఆశావర్కర్లతో సమీక్ష నిర్వహించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మురుగు కాలువలను శుభ్రం చేయించాలని, వీధుల్లో నీరు నిలువకుండా చేయాలని, చెత్తాచెదారం ఇళ్ల పక్కన పడేయకుండా చూడాలని, చెత్తను డంపింగ్ యార్డుకు తరలించాలని, దోమలు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్‌లు పాల్గొన్నారు.

లైబ్రేరియన్ల దినోత్సవం

రామగిరి(నల్లగొండ): ఎస్ఆర్ రంగనాథన్ జయంతి సందర్భంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మంగళవారం లైబ్రేరియన్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ హఫీజ్‌ఖాన్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అలెగ్జాండర్ పాల్గొన్నారు.

గుంతలు పూడ్చాలని వినతి

నల్లగొండ టౌన్: పట్టణంలో యూజీడీ పైప్‌లైన్ వేసిన చోట గుంతలు పూడ్చాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎండీ సలీం, పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య మంగళవారం ప్రజారోగ్య శాఖ ఇంజనీర్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సీసీ రోడ్లను పైప్‌లైన్ కోసం పగులగొట్టి వదిలేస్తున్నారని అన్నారు. వినతిపత్రం అందజేసినవారిలో కోట్ల అశోక్ రెడ్డి, అవుట రవీందర్ తదితరులు ఉన్నారు.

చట్టబద్ధత కల్పించాలి

నల్లగొండ టౌన్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పాలడుగు నాగార్జున ప్రభుత్వాన్ని కోరారు. నల్లగొండలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన వెంట కొండా వెంకన్న , నలపరాజు సైదులు, కొండ అనురాధ, పోలె సత్యనారాయణ, జిల్లా అంజయ్య, బుల్లు రవీందర్, మల్లెబోయిన రామలింగయ్య, కొత్త అంజయ్య, కట్ట అంజయ్య, ఎల్లయ్య, రాములు ఉన్నారు.

ఉత్తమ ట్రైనర్లుగా ఎంపికైన ఇంపాక్ట్ సభ్యులు


అంజిరెడ్డి


సాయికిరణ్


ప్రవీణ్‌కుమార్

నల్లగొండ, నల్లగొండ టూటౌన్, కట్టంగూర్ : తెలంగాణ యాంటీ నార్కొటిక్ బ్యూరో (ఈగల్ ఫోర్స్) సంస్థ ద్వారా ఉత్తమ ట్రైనర్లుగా గూడూరు అంజిరెడ్డి, కోట్ల సాయికిరణ్, నల్లగొండ పట్టణానికి చెందిన నారాయణ కవిత, కట్టంగూర్ మండలం చెరువుఅన్నారం గ్రామానికి చెందిన దెందె ప్రవీణ్‌కుమార్ (ఇంపాక్ట్ మోటివేషన్ ట్రైనర్) ఎంపికయ్యారు. డ్రగ్స్‌పై అవగాహన కల్పించడంలో ఉత్తమ సేవలు అందించినందుకు మంగళవారం హైదరాబాద్‌లో ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నిర్వహించిన యాంటీ నార్కొటిక్స్ శిక్షణ సందర్భంగా వీరికి అవార్డులు దక్కాయి. కార్యక్రమంలో టీజీఏఎన్‌బీ డైరెక్టర్ జనరల్ సందీప్ సండిల్యా, సీతారాములు, ఇంపాక్ట్ ఫౌండర్ గంప నాగేశ్వరరావు, ఇంపాక్ట్ సభ్యులు శ్రీధర్ వీరమళ్ళ, కృష్ణమూర్తి, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు డైరీల పంపిణీ


డైరీలు అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

చిట్యాల: విద్యార్థులు చదువు ఆవశ్యకతను గుర్తించి కష్టపడి చదివితే భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరుకుంటారని చిట్యాల మండలం వనిపాకల జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం బాణాల శ్రీనయ్య అన్నారు. లయన్స్ క్లబ్ గోల్డ్ నల్లగొండ సభ్యుడు ఏదుళ్ల అంజిరెడ్డి సమకూర్చిన డైరీలను లయన్స్ క్లబ్ సభ్యులతో కలిసి విద్యార్థులకు అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో క్లబ్ జోనల్ చైర్మన్ కర్నాటి విష్ణు, క్లబ్ ప్రెసిడెంట్ దాసోజు శ్రీనివాసచారి, ట్రెజరర్ చొక్కాల రవీంద్రచారి, సామ సంజీవరెడ్డి, ఉపాధ్యాయులు దంతూరి సైదులు గౌడ్, రవీందర్‌రెడ్డి, నర్సింహాచారి, కవిత, జ్యోతి, విజయ, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు కృషి చేయాలి

కేతేపల్లి: విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు నిరంతరం కృషి చేయాలని నకిరేకల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గుత్త మంజుల మాధవరెడ్డి అన్నారు. కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్ మోడల్ స్కూల్‌లో మంగళవారం నిర్వహించిన ఫ్రెషర్స్‌డే వేడుకల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. వేడుకల్లో ఎంపీవో ఎ.రాజేంద్రప్రసాద్, పాఠశాల ప్రిన్సిపాల్ మమత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏచూరి చిత్రపటానికి నివాళి

నల్లగొండ టౌన్: ఏచూరి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నల్లగొండలోని సుందరయ్య భవన్‌లో పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సయ్యద్ హాశం, పాలడుగు నాగార్జున, జిల్లా కమిటీ సభ్యులు ఎండీ.సలీం, పట్టణ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య, కొండ అనురాధ, నలపరాజు సైదులు, తుమ్మల పద్మ, కుంభం కృష్ణారెడ్డి, అవుట రవీందర్, కోట్ల అశోక్‌రెడ్డి, దండంపల్లి సరోజ పాల్గొన్నారు.

ప్రిలిమినరీ జీఓలు అమలు చేయాలని వినతి

నల్లగొండ టౌన్: రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాలను సవరిస్తూ 2021లో విడుదల చేసిన ఐదు ప్రిలిమినరీ జీఓలను అమలు చేయాలని కోరుతూ సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చిన్నపాక లక్ష్మీనారాయణ మంగళవారం నల్లగొండలో డిప్యూటీ లేబర్ కమిషనర్ జీబీఎస్ స్వామికి వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య, బాణాల పరిపూర్ణచారి, గంజి నాగరాజులు ఉన్నారు.

ఎన్‌సీసీ సర్టిఫికెట్లు అందజేత


సర్టిఫికెట్లతో ఎన్‌సీసీ కేడెట్లు

నకిరేకల్ : ఎన్‌సీసీ శిక్షణ పూర్తి చేసుకున్న నకిరేకల్‌లోని ఏవీఎం ఉన్నత పాఠశాలకు చెందిన 45 మంది విద్యార్థులకు నల్లగొండ ఎన్‌సీసీ–31 బెటాలియన్ అధికారి చంద్రవీర్ మంగళవారం సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఏవీఎం పాఠశాల ప్రిన్సిపాల్ కందాల స్వప్నారెడ్డి శ్రీకాంత్, పాఠశాల అసోసియేట్ ఎన్‌సీసీ అధికారి నిమ్మల శంకర్‌గౌడ్, సీనియర్ ఎన్‌సీసీ కేడెట్స్ పాల్గొన్నారు.


హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

చిట్యాల: పాఠశాల అభివృద్ధికి కేటాయించిన నిధులను దుర్వినియోగం చేసిన చిట్యాల జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు మాధవిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆ పాఠశాల ఎస్ఎంసీ మాజీ చైర్మన్ పోల్లేపల్లి సత్యనారాయణ, బీఎస్పీ జిల్లా నాయకుడు గ్యార శేఖర్ మంగళవారం చిట్యాల మండల ప్రత్యేకాధికారి పి.శ్రావణ్‌కుమార్, ఎంఈఓ పి.సైదానాయక్‌కు వినతి పత్రం అందజేశారు. పాఠశాలకు మంజూరైన సుమారు ఆరున్నర లక్షల రూపాయలను హెచ్ఎం దుర్వినియోగం చేసిందని ఆరోపించారు.

ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం.. ముగ్గురి అరెస్ట్

శాలిగౌరారం: ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగులను నమ్మించి మోసం చేసిన కేసులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్టణంకు చెందిన ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి మంగళవారం శాలిగౌరారం పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో తెలిపారు. వివరాలు.. విశాఖపట్టణంకు చెందిన వావిళ్ళపల్లి సాయిరామజగదీష్(42), వావిళ్ళపల్లి మహేశ్(40) సొంత అన్నదమ్ములు. వీరిద్దరూ విశాఖపట్టణంలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నారు. వీరితోపాటూ అదే పట్టణానికి చెందిన సనపాల సురేశ్(52) అక్కడే సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. వీరు ముగ్గురు కలిసి నిరుద్యోగుల ఫోన్ నంబర్లు సేకరించి ఉద్యోగాలు ఇప్పిస్తామని ఫోన్ చేసి మాయమాటలతో నమ్మబలికేవారు. అందుకు రూ.1410 (బ్యాంక్ అకౌంట్ ఓపెనింగ్‌కు రూ.1000, అప్లికేషన్ ఫీజు రూ.410) తమ అకౌంట్‌లోకి ట్రాన్స్‌ఫర్ చేయించుకుంటారు. అందులో భాగంగానే శాలిగౌరారం మండలంలోని వల్లాల గ్రామానికి చెందిన మందుల వెంకన్న, మందుల శివాజీకి వావిళ్ళపల్లి సాయిరామజగదీష్ ఫోన్‌చేసి తనపేరు శ్రీనివాసరెడ్డి అని, తాను నల్లగొండ విద్యుత్ శాఖలో ఏఈగా పనిచేస్తున్నానని, తమ డిపార్ట్‌మెంట్‌లో సిస్టమ్ వర్క్ చేయడానికి జూనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని నమ్మబలికించాడు. అతడి మాటలు నమ్మిన వెంకన్న, శివాజీ.. ఒక్కొక్కరు రూ.1410 చొప్పున అతడి అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు. కొద్దిరోజులకు ఏఈ శ్రీనివాసరెడ్డిని కలిసేందుకు మందుల వెంకన్న, శివాజీ నల్లగొండలోని ట్రాన్స్‌కో కార్యాలయానికి వెళ్లారు. అక్కడున్న అధికారులను, సిబ్బందిని అడుగగా ఏఈ శ్రీనివాసరెడ్డి అనేవ్యక్తే ఈ కార్యాలయంలో లేరని చెప్పారు. దీంతో వారు తాము మోసపోయామని గ్రహించి ఈ నెల 8న శాలిగౌరారం పోలీస్‌స్టేషన్‌లో వారు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న ఎస్ఐ సైదులు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో మోసాలకు పాల్పడిన వావిళ్ళపల్లి సాయిరామజగదీష్, వావిళ్ళపల్లి మహేశ్, సనపాల సురేశ్‌లు విశాఖపట్టణం నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్నట్లు మంగళవారం అందిన విశ్వసనీయ సమాచారంతో ఎస్ఐ సైదులు తమ సిబ్బందితో నకిరేకల్ బైపాస్ వెంట ఉన్న నగేశ్ హోటల్ వద్ద కాపుగాసి ముగ్గురు నేరస్తులను పట్టుకుని అరెస్ట్ చేశారు. విచారించగా రెండు సంవత్సరాలుగా మోసాలకు పాల్పడుతున్నట్లు అంగీకరించారు. రూ.1410 తక్కువ డబ్బులు కాబట్టి పోలీసులకు ఫిర్యాదు చేయరనే ఉద్దేశంతో మోసాలకు పాల్పడుతున్నామని తెలిపారు. ఇప్పటి వరకు 400 మందికి పైగా నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేసి ఆ డబ్బును విలాసాలకు ఖర్చు చేసినట్లు పోలీసుల విచారణలో తెలిపారు. వీరి వద్ద నుంచి 11 సెల్‌ఫోన్‌లు, 7 బ్యాంకు ఖాతా బుక్‌లు, రూ.1600 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ముగ్గురు నేరస్తులను రాత్రి నకిరేకల్ జూనియర్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా వారికి రిమాండ్ విధించడంతో నల్లగొండ జైలుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

మంగళగౌరీ దేవిగా రేణుకా ఎల్లమ్మ



కనగల్ మండలంలోని దర్వేశిపురం శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం అమ్మవారిని మంగళగౌరీ దేవిగా అర్చకులు అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు మల్లాచారి అమ్మవారికి హారతి ఇచ్చారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అర్చకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

– కనగల్

కలశయాత్రకు ఘన స్వాగతం

నల్లగొండ టౌన్: అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో చేపట్టిన రే జండ్ల రజు కలశ యాత్రకు నల్లగొండలోని గడియారం సెంటర్‌లో మంగళవారం రాత్రి యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు ముచ్చర్ల ఏడుకొండల యాదవ్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశమంతా ఈ కలశ యాత్ర తిరిగి వచ్చిన తర్వాత ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద 10 లక్షల మంది యాదవులతో సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. యాత్రకు స్వాగతం పలికినవారిలో లోడంగి గోవర్ధన్ యాదవ్, సుభాష్ యాదవ్ , సుధాకర్ యాదవ్, మల్లయ్యయాదవ్, జానయ్య యాదవ్, నారాయణ యాదవ్‌లు ఉన్నారు.


యాత్రకు స్వాగతం పలుకుతున్న నాయకులు